సాయం అందక.. మద్దతు లేక

- అన్నదాతపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- ముగియనున్న రబీ సాగు
- పంటలకు దక్కని గిట్టుబాటు ధర
- తీవ్ర నిరాశలో రైతులు



సాగు చేసిన వరి పంట



ముప్పాళ్ళ: గత ప్రభుత్వంలో నిశ్చింతగా వ్యవసాయం చేసుకున్న రైతన్నకు కష్టకాలం వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏదో చేస్తుందని ఆశపడ్డ ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తన మార్కు మోసం చూపిస్తున్నారు. రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం.. ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు అందిస్తాం.. అంటూ కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఊరూరా తెగ ప్రచారం చేశారు. వారి మాటలను నమ్మిన ప్రజలకు అధికారం కట్టబెట్టారు. తీరా గద్దెనెక్కిన తర్వాత రైతన్నను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ సీజన్ కూడా మరి కొద్ది రోజుల్లో ముగియనుంది. అయినప్పటికీ అన్నదాత సుఖీభవ పథకం కింద కూటమి ప్రభుత్వం వేస్తామన్న సాయంలో ఒక్క పైసా కూడా వేయలేదు. ఈ పథకంపై స్పష్టత ఇవ్వటం లేదు. అదిగో, ఇదిగో అంటూ కాల యాపన చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీ ప్రస్తావన లేకుండా పోయింది. అదేమంటే ఆదాయం లేదంటూ రైతులను మోసం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

రైతులకు తప్పని తిప్పలు

పెట్టుబడి సాయం అందుతుందనే ఆశతో అధిక వడ్డీలకు అప్పు తెచ్చి సాగు చేసిన రైతులకు పెట్టుబడి సాయం అందక తిప్పలు పడుతున్నారు. ప్రభుత్వ పెట్టుబడి సాయం రాకపోవటంతో రైతులు మోసపోయామని గ్రహించి, నోరు తెరిస్తే ఏమవుతుందోననే భయంతో లోలోపల మదన పడాల్సిన పరిస్థితి దాపురించింది. వీటికి తోడు సాగు చేసిన పంటలకు మద్దతు ధర దక్కడం లేదు. గిట్టుబాటు ధర కల్పించటంలో కూటమి నేతలు శ్రద్ధ చూపకపోవటంతో రైతులు అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి. సాగులో వచ్చిన రాబడి అంతా అప్పులకే చెల్లించాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలో మొత్తం 10 వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. అందులో ఖరీఫ్ సీజన్‌లో 8,800 ఎకరాల్లో, రబీలో 5,500 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేశారు.

రైతన్నకు దన్నుగా వైఎస్సార్‌సీపీ

గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి రైతులకు ఇచ్చిన హామీలన్నీ తీర్చుతూ దన్నుగా నిలిచారు. కుటుంబ పెద్దలా సమయానికి రైతు భరోసా సాయంతో ఆదుకునేవారు. ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా పథకం ద్వారా రైతు ఖాతాలోనే నేరుగా రూ.13,500 జమ చేశారు. రైతు భరోసా కేంద్రం ద్వారా సకాలంలో విత్తనాలు అందించటంతో పాటు ఎరువులు కూడా సరఫరా చేసేవారు. రైతు భరోసా పథకం ద్వారా ఐదేళ్ల పాలనలో ఒక్క సత్తెనపల్లి నియోజకవర్గంలోని 38,583 మంది రైతులకు రూ.36,65,38,500 నగదు జమ చేశారు.

పేరు మార్చి మోసం చేశారు



గతంలో రైతు భరోసా పథకాన్ని కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ అంటూ పేరు మార్చింది. ఏటా పెట్టుబడి సాయంగా రూ.20 వేలు వేస్తామని హామీ ఇచ్చారు. ఖరీఫ్ పూర్తయినా నేటికీ డబ్బులు వేయలేదు. పథకం పేరు మార్చే తప్ప చంద్రబాబులో ఎలాంటి మార్పు లేదు.

– కిక్కురు రామిరెడ్డి,
లంకెలకూరపాడు, ముప్పాళ్ళ మండలం

హామీ నిలబెట్టుకోవాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. గతంలో మాదిరిగానే కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసింది. ఈ ఏడాది రావాల్సిన సాయం, వచ్చే ఏడాదితో కలిపి రైతులకు అందించాలి. ప్రస్తుత పరిస్థితిలో సాగు భారంగా మారింది.

– తొరటి అమరలింగేశ్వరరావు,
కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు, చాగంటివారిపాలెం

క్లుప్తంగా

కమిషనర్ షమ్మీకి సత్కారం



సత్తెనపల్లి: మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ గ్రేడ్-2 కమిషనర్‌గా పదోన్నతి పొంది విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్‌గా బదిలీపై వెళుతున్న కొలిమి షమ్మీని సబ్ కోర్టు పీపీ బగ్గి నరసింహారావు ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించి కమిషనర్ షమ్మీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత డీఎస్పీ కాలేషావలి, న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, బిక్కి నాగేశ్వరరావు, కాంట్రాక్టర్ కూకట్ల శ్రీనివాసరావు, దాసరి తిరుపతిరావు తదితరులు ఉన్నారు.

లింగంగుంట్లలో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం



పెదకూరపాడు: మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు ఆరోగ్య, అంగన్‌వాడీ శాఖల సమన్వయంతో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది ఆకుల నాగార్జున, మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ మున్ని, హెల్త్ సూపర్‌వైజర్ బండారు శ్రీనివాసరావులు గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగ చిన్నారులను గుర్తించి వారికి పింఛన్ వస్తుందా, లేదా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి, సీహెచ్‌ఓ శ్యామల, ఏఎన్‌ఎం లూర్దు రాణి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్, హోలీ ఫ్యామిలీ స్కూల్‌లో శనివారం జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టభద్రులు అందరూ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కోసం ఏ విధంగా కృషి చేశారో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా రెట్టింపు స్థాయిలో కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పన కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పరిశీలకుడు వేములకొండ శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.

వారాబందీ అమలు

ముప్పాళ్ళ: నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గినందున సాగర్ కుడికాల్వ పరిధిలో వారాబందీ అమలు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ శనివారం చెప్పారు. వారాబందీలో భాగంగా 9 రోజులు లింగంగుట్ల సర్కిల్ పరిధిలోని కాలువలకు నీటి సరఫరా చేయబడుతుందన్నారు. ఆరు రోజులు నీటి సరఫరా నిలిపివేయ బడుతుందన్నారు. అందులో భాగంగా ఈ నెల 28వ తేదీన లింగంగుట్ల పరిధిలోని కాలువలకు నీటి సరఫరా ఆపి వేయబడుతుందన్నారు. రైతులు నీటిని జాగ్రత్తగా అవసరం మేరకు వాడుకొని, వృథాను అరికట్టాలని కోరారు.

మాదలలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం



మాదల(ముప్పాళ్ళ): పిల్లల్లో సృజనాత్మకతను పెంచడానికి ఫ్రీ డ్రాయింగ్, ఫ్రీ ప్లే లు ఉపయోగపడతాయని ఎంఈఓ-2 సీతారామిరెడ్డి చెప్పారు. మండలంలోని మాదల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండవ విడత జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సు శనివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ-2 సీతారామిరెడ్డి మాట్లాడుతూ సామాజిక భావోద్వేగాల నియంత్రణ కొరకు మట్టితో ఆటలు, ఇసుకతో ఆటలు దోహదపడతాయన్నారు. హార్ట్ ఫుల్‌నెస్ సంస్థ సభ్యులు బీ హేమలత, బీ అంజనాదేవి, బీ సాయితేజలు అంగన్‌వాడీ కార్యకర్తలకు మానసిక ఒత్తిడి తగ్గించుకోవడానికి మెడిటేషన్ చేయించారు. కార్యక్రమానికి డీఆర్పీలుగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జీ జయలక్ష్మి, ఉపాధ్యాయులు వై.యోగానంద, ఎస్.స్వర్ణలతలు వ్యవహరించారు.

కొత్త ధాన్యంతో పొంగళ్ల నైవేద్యం

నేడే అంకమ్మతల్లి తిరునాళ్ల



అంకమ్మతల్లి అమ్మవారు

రాజుపాలెం: రాజుపాలెంలో కొలువుదీరిన అంకమ్మతల్లి కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, భక్తుల పాలిట కొంగుబంగారం. ఈ ఆదిపరాశక్తికి శతాబ్ద కాలం నుంచి ఏటా ఫిబ్రవరి ఆఖరి ఆదివారం (23వ తేదీ) అత్యంత వైభవంగా తిరునాళ్ల జరుగుతుంది. కారంపూడి వీర్ల దేవాలయంలోని వీరుల ఆయుధాల (దైవాలను)ను తిరునాళ్ల ముందు రోజు (శనివారం రాత్రి) తీసుకువచ్చి పురవీధుల్లో ఊరేగిస్తూ సేవ చేస్తారు. పాడిపంటలు, భోగ భాగ్యాలతో చల్లగా చూసే తల్లికి తొలి ధాన్యపు కంకుల పొంగళ్ల నైవేద్యంగా సమర్పించి చీర, సారెలతో వాయిద్యాల నడుమ మొక్కులు తీర్చుకుంటారు. మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. సాయంత్రం 4 గంటల నుంచి విద్యుత్ ప్రభలు, కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో రాత్రంతా జాగారం చేస్తారు.

ఉత్సవాలకు సిద్ధం

ఈ ఏడాది ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. దేవాలయాన్ని వివిధ రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అంకమ్మతల్లి బ్రహ్మోత్సవాలు త్రయాహ్నిక దీక్షతో అత్యంత వైభవంగా నిర్వహించడం ఇక్కడ ఆచారం. అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని అర్చకులు అర్వపల్లి ఫణికేశవ శర్మ కోరారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ కె.వేణుగోపాల్ ఆలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు పెట్టరాదని తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనలను ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఏఎంసీల ద్వారా టమాటా కొనుగోలు

– హెచ్‌ఓ శ్రీనిత్య

అచ్చంపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా టమాటా కిలో రూ.8 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేయనున్నట్లు హార్టీకల్చర్ అధికారి శ్రీనిత్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టమాటా వేసిన రైతులు మార్కెట్ కమిటీలకు తరలిస్తే రవాణా ఖర్చులు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన టమాటాను ప్రభుత్వం ఇతర జిల్లాలకు తరలించి రైతు బజార్లో విక్రయించడం జరుగుతుందన్నారు. టమాటా రైతులు ఆందోళన చెందకుండా పండించిన పంటను మార్కెట్ కమిటీలకు తరలించేందుకు స్థానిక రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బందిని సంప్రదించవలసినదిగా ఆమె కోరారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

బెల్లంకొండ: ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై డి.ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం మృతుడు గ్రామానికి చెందిన రమావతు కావరియా నాయక్(30) అని తెలిపారు. మృతుడి భార్య కొన్నేళ్లుగా దూరంగా ఉంటూ వేరే ఊళ్లో నివాసం ఉంటుంది. కాగా కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురై శుక్రవారం రాత్రి ఉరి వేసుకున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఉరేసుకొని ఉండడాన్ని కుటుంబ సభ్యులు గమనించగా అప్పటికే మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నారు.

కొండచిలువ కలకలం



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ శివారు బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో కొండ చిలువ కలకలం సృష్టించిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పిడుగురాళ్ల, జానపాడు సరిహద్దులోని కొండ ప్రాంతంలో ఉన్న జగ్జీవన్‌రామ్ కాలనీలోకి తొమ్మిది అడుగుల కొండ చిలువ ఇళ్ల మధ్యలోకి రావటంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. కాలనీలో ఉన్న యువకులు కొండ చిలువను కర్రలతో కొట్టి చంపివేశారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి




రైతులకు సూచనలిస్తున్న ఏవో కె.దేవదాసు

నకరికల్లు: వ్యవసాయ సంక్షేమ పథకాలు రైతులకు అందేందుకు ఈ కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో శనివారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మర్ ఈ కేవైసీ నమోదుకు ఈ నెల 25వ తేదీతో గడువు ముగుస్తుందని అన్నారు. అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్టర్ ఐడీ నంబర్‌ను రైతులకు జారీ చేస్తామన్నారు. రిజిస్టర్ ఐడీ నంబర్ పొందేందుకు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ చేయబడిన ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు జి.జగదీష్, రైతులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

బాధితుల యూనియన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించిన అగస్టీన్

సత్తెనపల్లి: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అగ్రిగోల్డ్ బాధితుల యూనియన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ కోరారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కేతినేని అగస్టీన్ మాట్లాడుతూ సమర్థ అధికారుల బృందంతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి బాధితుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయించి, జప్తు చేసిన ఆస్తులన్నిటినీ కోర్టులో అబ్సెల్యూట్ చేయించాలని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో అగ్రిగోల్డ్ బాధితుల విషయంపై చర్చించి బడ్జెట్ కేటాయించి సత్వర న్యాయం చేయాలని కోరారు. బాధితులపై దౌర్జన్యం చేయడాన్ని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి లేఖలు పంపుతామన్నారు. నియోజకవర్గంలోని బాధితులకు న్యాయం చేకూర్చమని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆయనతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి షేక్ కరీముల్లా, నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, జగన్నాథం, కోటేశ్వరరావు, కొత్తూరు శ్రీనివాసరావు, కూరపాటి సుబ్బారాయుడు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ శివార్లోని గోలివాగు వద్ద 167 ఏడీ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. నల్గొండ జిల్లా దామరచర్ల మండలం ఇరుగూడెంకు చెందిన కుంజా వంశీకృష్ణ ద్విచక్రవాహనంపై మాచర్ల నుంచి దాచేపల్లికి వెళ్తుండగా జాతీయ రహదారిపై అడ్డుగా పెట్టిన డ్రమ్ములు కన్పించక వాటిని ఢీకొట్టాడు. దీంతో అదుపుతప్పి కిందపడిన వంశీకృష్ణకు తలభాగాన తీవ్రగాయాలు కాగా వెంటనే గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం మిర్యాలగూడెంకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో కంది సాగు చేస్తున్న రైతులు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని పంటను విక్రయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి కోరారు. శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఏపీ మార్కెఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకోసం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు నుంచి మాత్రమే మద్దతు ధర రూ.7,550లకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు బ్యాంక్ ఖాతాలకు నేరుగా 10 రోజులలోపే నగదును చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు.

విద్యా ప్రమాణాలకు పునాది వేసిన ఆజాద్



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: దేశంలో తొలి విద్యా శాఖ మంత్రిగా విద్యా ప్రమాణాలకు పునాది వేసిన వ్యక్తి భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి అన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడు, మొదటి కేంద్ర విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ పత్రికను స్థాపించి ప్రజలను చైతన్యవంతం చేసి దేశానికి స్వాతంత్రం సాధించడంలో తన వంతు కృషి చేశారన్నారు. ఆజాద్ ఆదర్శప్రాయుడని, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని ఆయన సేవలను కొనియాడారు. ముందుగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, షేక్ నాగూర్ మీరాన్, పెండెం బాబురావు, షేక్ మౌలాలి, అచ్యుత శివప్రసాద్, గుజ్జర్లపూడి సతీష్, తుమ్మల వెంకటేశ్వరరావు, లోక మాధవ, బండి మల్లికార్జునరెడ్డి, షేక్ జలీల్, ఉల్లంగుల ప్రసాద్‌బాబు, జూపల్లి పాల్, సంకుల తిరుమలరావు, వల్లెం నరసింహారావు, శిరిగిరి వెంకట్రావు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. అలాగే పట్టణంలోని రఘురాంనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో దేశ తొలి విద్యా శాఖ మంత్రి, స్వాతంత్య్ర సమర యోధుడు, గొప్ప విద్యావేత్త మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆజాద్ చిత్రపటానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దరువూరి నాగేశ్వరరావు, సయ్యద్ పెద్దకరీముల్లా, సయ్యద్ మహబూబ్, దూదేకె, ర్యాంబో బుడే, జాన్‌బాబు, తురక మేరిగ్రేస్, కోమటినేని శ్రీనివాసరావు, మక్కపాటి రామచంద్రరావు, ఆతుకూరి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు తక్షణమే తొలగించాలి

గ్రంథాలయ ఉమ్మడి గుంటూరు జిల్లా సెక్రటరీ సుబ్బరత్నమ్మ



గ్రంథాలయ స్థలాన్ని పరిశీలిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లా సెక్రటరీ సుబ్బరత్నమ్మ

సత్తెనపల్లి: గ్రంథాలయ స్థలంలో ఆక్రమణలను తక్షణమే తొలగించాలని గ్రంథాలయ ఉమ్మడి గుంటూరు జిల్లా సెక్రటరీ వంకధారి సుబ్బరత్నమ్మ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని లక్కరాజుగార్లపాడు సెంటర్‌లో ఖాళీగా ఉన్న పాత గ్రంథాలయ స్థలంలో ఆక్రమణలను తొలగించాలని స్థానిక గ్రంథాలయ అధికారులు ఎన్ని సార్లు చెప్పినా ఆక్రమణదారులు పెడచెవిన పెట్టడంతో శనివారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణమే ఆక్రమణలు తొలగించాలని హెచ్చరికలు చేశారు. ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పొద్దని, గ్రంథాలయ స్థలాలను డిజిటల్ గ్రంథాలయాల నిర్మాణం కోసం కేటాయించడం జరిగిందన్నారు. తక్షణమే తొలగించాలని ఆదేశించటంతో ఆదివారం ఉదయానికి ఖాళీ చేస్తామని కోరడంతో అందుకు అంగీకరించి గడువు ఇచ్చారు. ఆమెతో పాటు స్థానిక గ్రంథాలయ అధికారి కె.వాణి ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: మండలంలోని దేచవరం గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వేళాంగిణి మేరీ తెలిపారు. ప్రవేశం కోసం సంబంధిత జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలు నిరవధికంగా చదివి ఉండాలన్నారు. 2024-25లో 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత పొంది ఉండాలన్నారు. అర్హత గల విద్యార్థులు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి 31 మార్చిలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 1 నవంబర్ 2013 నుంచి 31 ఆగస్టు 2015లోగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1 నవంబర్ 2011 నుంచి 31 ఆగస్టు 2015 మధ్య కాలంలో పుట్టి ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో గానీ పాఠశాలలో గానీ సంప్రదించాలన్నారు.

సత్తెమ్మతల్లి దేవాలయంలో చోరీ



దుండగులు పగలగొట్టిన అమ్మవారి హుండీ

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభు సత్తెమ్మతల్లి దేవాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం ఉదయాన్నే పూజారి ఆలయానికి వెళ్లగా హుండీ పగలుగొట్టి ఉండటాన్ని గమనించారు. అందులో గత 10 రోజులుగా భక్తులు సమర్పించిన కానుకలు సుమారు రూ.50 వేల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. గత రెండు, మూడు నెలల కాలంలో అమ్మవారి దేవాలయంలో హుండీ పగలగొట్టటం ఇది రెండవసారి. దేవాలయంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి మరీ దోపిడీకి పాల్పడ్డారంటే ఆరితేరిన దొంగలుగా భావిస్తున్నారు. గతంలో జరిగిన చోరీలో పెనుగంచిప్రోలుకు చెందిన కొంత మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మళ్లీ అదే విధంగా చోరీ జరగడంతో ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఉపాధి పనులలో రికవరీకి ఆదేశాలు



మాట్లాడుతున్న డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి

అచ్చంపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అచ్చంపేట మండలంలో గత ఏడాది జరిగిన పనులకు సంబంధించి గత 10 రోజులుగా జరుగుతున్న సోషల్ ఆడిట్‌పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజావేదిక నిర్వహించారు. ముఖ్య అతిథిగా డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి హాజరయ్యారు. గత ఏడాది మొత్తం 1,238 పనులకు గాను రూ.7,22,91,036, పంచాయతీరాజ్ శాఖ ద్వారా 25 పనులకు గాను రూ.1,45,57,919 వెచ్చించారు. జరిగిన పనులు, వినియోగించిన మొత్తంపై ఆడిట్ సిబ్బంది గత 10 రోజులుగా గ్రామాలలో సోషల్ ఆడిట్ నిర్వహించి తుది నివేదికను ప్రజావేదికలో ఉంచారు. నివేదికలో ఉపాధి పనుల నిర్వహణలో లోపాలు, హార్టికల్చర్ ప్లాంటేషన్ ద్వారా వేసిన మొక్కలు లేకపోవడం, కొని గ్రామాలలో వలంటీర్లు ఉపాధి పనులకు హాజరుకావడం వంటి విషయాలను గుర్తించారు. ఉపాధి సిబ్బంది నుంచి రూ.65,522 రికవరీకి ఆదేశించగా సిబ్బందిపై మరో రూ.18,500 పెనాల్టీ విధించారు. చెరుకుంపాలెం, తాడువాయి గ్రామాలలో అత్యధికంగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీపీ వి.నారాయణ, జెక్యు సీఓ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, తోట నాగశ్రీనివాస్, ఆడిట్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు. గత 10రోజులుగా జరిగిన సోషల్ ఆడిట్, బహిరంగంగా జరగవలసిన ప్రజావేదికను మండల పరిషత్ సమావేశపు హాలులో విలేకరులకు కూడా తెలియకుండా గోప్యంగా నిర్వహించడం పట్ల పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.